

# ప్రజాజ్యోతి

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 8 | జూన్ | 2024 | పేజిలు : 4





## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు...

# కట్టుదిట్టమైన భద్రత

**- జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లు**

**- పరీక్షకు హాజరు కానున్న 8,871 మంది అభ్యర్థులు**


**- ఎస్పీ రోహిత్ రాజు**

*కొత్తగూడెం క్రైమ్, జూన్ 7, ప్రజాజ్యోతి*

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపి ఎస్ సి) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరపున అన్ని రకాల భద్రతాపరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లలో మొత్తం 8,871 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని,పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా భద్రతాపరంగా మరియు ఇతర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి విలులేదన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ షాపులు తెరిచి ఉంచరాదని తెలియజేసారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థులను అనుమటించడం జరుగుతుందని, అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. పరీక్ష రోజున ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుంది. ఖచ్చితంగా 10 గంటలకు ఎగ్జామ్ సెంటర్ గేట్లు మూసివేయడం జరుగుతుంది. 10 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ఎవ్వరినీ లోపలికి అనుమతించడం జరగదని తెలిపారు. ఎగ్జామ్ కు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్ మీదున్న నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఒక కలర్ ఫోటో,ఒరిజినల్ ఆధార్ కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్/ఉద్యోగి గుర్తింపు కార్డ్/ఓటర్ గుర్తింపు కార్డ్ ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుంది. హాల్ టికెట్ నందు ఫోటో సరిగ్గా కనిపించకపోయినట్లైతే 3-కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్ పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకొని రావలిసి ఉంటుంది. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూకున్నట్లైతే,పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చు. పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారని అన్నారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్స్,వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్స్ లాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ ను అనుమతించడం జరగదన్నారు. ఎగ్జామ్ పూర్తయిన తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎవ్వరినీ బయటకు పంపడం జరగదు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్,మాస్ కాపీయింగ్ చేసినట్లు తేలితే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

**కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల**



*భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 7, ప్రజాజ్యోతి*

టీజీపీఎస్సీ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా బయోమెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం 8,875 మంది పరీక్షకు హాజరు కానున్నారని, ఇందుకోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటలకే గేట్లు మూసివేస్తారని, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను కేంద్రంలోకి అనుమతించేది లేదని, నిమిషం నిబంధన కచ్చితంగా అమలులో ఉంటుందని, అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

# నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



**గుట్కాలు నిల్వచేసిన - విక్రయించిన చట్టపరమైన చర్యలు తప్పవు : ఎస్ఐ**

**ఎస్ఐ అధ్వర్యంలో పలు షాపులలో ఆకస్మిక తనిఖీలు..**

**షాపులలో నిలువ చేసినటువంటి గుట్కా ప్యాకెట్లు స్వాధీనం..**

*భద్రాచలం, జూన్ 7, ప్రజా జ్యోతి*




భద్రాచలం పట్టణంలో అక్రమ గుట్కా వ్యాపార స్థావరాలపై దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 5 లక్షల రూపాయల విలువైన గుట్కాలను పట్టణ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నెహ్రూ మార్కెట్ లో ఆశాపుర, వినాయక ట్రేడర్స్, బెహరా ఫ్యాన్సీ, సాగర్ ఫ్యాన్సీ, రాందేవ్, మాత ఎంటర్ప్రైజెస్ షాపులలో అక్రమంగా గుట్కాలు నిల్వ ఉంచారనే సమాచారంతో శుక్రవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భారీగా గుట్కాలు లభ్యమయ్యాయి. గుట్కాలను స్వాధీనం చేసుకుని దుకాణ యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

# పార్టీ, ప్రజా సంఘాలను బలోపేతం చేయాలి




**ఇల్లందు, జూన్ 7, ప్రజాజ్యోతి:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సిపిఐ, అను బంధ సంఘాలను మరింత బలో పేతం చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రో ల్ కమిషన్ సభ్యుడు మిర్యాల రంగయ్య పిలుపు మిరియాల రంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ప్రజాస్వామ్యానికి పట్టం కట్టారని నియంతృత్వ రాచరిక విధానాలకు స్వస్తి పలికారని, బిజెపి, ఆర్ఎస్ఎస్ ను ప్రజలు వ్యతిరేకి స్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు చూస్తే అర్థమవుతుం దన్నారు. 350 నుండి 400 సీట్లు వస్తాయన్న బిజెపి గొంతు మూగబో యిందని, సొంతగా అధికారంలోకి వస్తామని అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సైతం మారుస్తామని రిజర్వేషన్లను ఎత్తివేస్తామని గొంతు చించుకొని ప్రచారం చేసిన బిజెపి అహంభావానికి అహంకారానికి ప్రజ లు ఓటుతో సమాధానం చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి బలపడకుండా మునుగోడులో బిఆర్ఎస్ పార్టీతో కలిసి పోవాల్సిన పరిస్థితి వచ్చిందని, ఆ ప్రభావం వల్లనే బిజెపి తెలంగాణలో బలహీన పడిందని మరల పార్లమెంట్ ఎన్ని కల్లో తెలంగాణ రాష్ట్రంలో 8 సీట్లు గెలుచుకొని అవకాశం బిఆర్ఎస్ కల్పించిందని ఆరోపించారు. బీజేపీ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుం దని, తెలంగాణ రాష్ట్రంలో కమ్యూ నిస్టుల ప్రభావం ఉన్నంతవరకు అది సాధ్యం కాదన్నారు. టిఆర్ఎస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీగా పేరు మార్చుకున్న తర్వాత దేశంలోనే తన రాజకీ యాలను ప్రభావితం చేస్తామని బీరా లు పలికిన కెసిఆర్ రాష్ట్రంలో పార్ల మెంట్ ఎన్నికల్లో సతికిలపడ్డా డని, ఉట్టికి గర్లేనమ్మ ఆకాశానికి ఎగిరి నట్లు రాష్ట్రాన్ని దోచుకున్నది చాలక దేశాన్ని కూడా దోచుకోవాలని ఆశ పడ్డ కేసీఆర్ కి ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు. బిఆర్ఎస్ ఓట్లు క్రాసింగ్ చేసి రాష్ట్రంలో బిజెపి బల పడేందుకు రహస్య ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. ఎన్ని కల్లో డబ్బుల ప్రభావం వల్ల కమ్యూ నిస్టులు తమ బలం ఉన్న స్థానాలను కూడా ఇతరులకు వదులుకునే పరిస్థితి ఏర్పడిందని, ఎన్ని ప్రభా వాలున్న కమ్యూనిస్టులుగా మనకు ప్రయత్నం లోపం ఉండకూడదని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండి వారి సమస్యల పట్ల స్పందించి పోరాటాల ద్వారా ప్రజల అభిమానా న్ని చురగొనాలని సూచించారు. ఇల్లెందు పూసపల్లి ఓసి కోసం కార్మి కులు ఉద్యమ బాట పట్టాల్సిన ఆవశ్యకత ఉందని, దానిని మనం సాధించుకోలేకపోతే ఇల్లందు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, అందరూ ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో ఏఐటి యుసి సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె. సారయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవర కొండ శంకర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, మండల కార్యదర్శి ఉడుత ఐలయ్య, కౌన్సిలర్ కుమ్మరి రవీందర్, ఏఐటియుసి బ్రాంచ్ కార్య దర్శి యండి. నజీర్ అహ్మద్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, గిరిజన సంఘం నాయకులు గుగు లోత్ కృష్ణ, ఏఐటియుసి నాయకులు గడిదాసు నాగేశ్వరరావు, కొరిమి సుందర్, సంజీవ చారి, జయరాజ్, మంచాల వెంకటేశ్వర్లు, వడ్ల శ్రీని వాస్, కనకతార, శ్రీలక్ష్మి, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చదువులు నేర్చుకోండి సంస్కారం పెంచుకోండి

**- బాలల్లారా రండి మీ కోసమే ఈ బడిబాట**

**- గ్రామాల్లో చైతన్యపరుస్తున్న ఉపాధ్యాయులు**



**బూర్గంపహాడ్, జూన్ 7, ప్రజాజ్యోతి**

నేడు ప్రభుత్వం బడి ఈడు పిల్లలను బడిలో చేర్చుకొని వారి ఆర్థిక స్వావలంబన దిశగా పయనింపజేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాటను ప్రతి ఒక్కరు విజయవంతం చేసి విధిగా అందరూ భాగస్వాములు కావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు గిరిజన ఆశ్రమ పాంశాల(బాలురు) ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బడిబాటను నిర్వహించారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్చుకొని చదువులు నేర్చుకొని వారి తలరాతను మార్చుకోమని పల్లెలో ఉపాధ్యాయులు వినూత్న ప్రదర్శన చేపట్టారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తుపై బూర్గంపాడు మండలంలోని ఇరవెండి శ్రీరాంపూర్, చింతకుంట గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బడికి దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న చిన్నారుల కోసమే ప్రభుత్వం ఈ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మీ చెంతకి ఉపాధ్యాయులు వస్తారని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య తో పాటు పౌష్టికాహారంను అందించి ఉచితంగా పాఠ్య పుస్తకాలు దుస్తులు అందిస్తారని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యాబోధనకు ప్రభుత్వ బడులే మార్గదర్శకమని చిన్నారుల తల్లి దండ్రులను చైతన్య పరిచారు. ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులే ముద్దు అంటూ ఖరీదైన విద్యాబోధన వెనక ఎన్నో కష్టాలు ఉంటాయని ప్రైవేటు పాఠశాలలో చేర్చి మీ బతుకులను ఇబ్బందులు గురి కావద్దని ఇలాంటి విద్యా భారం తల్లిదండ్రులకు కాకుండా ఉచితంగా అన్ని రకాల వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాల నమ్మాలని తెలిపారు. బడికి దూరమై బాల్యాన్ని బుద్ధి చేసుకోకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరి విద్యాబుద్ధులు నేర్చుకొని సమాజానికి ఒక మంచి మార్గదర్శక కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప్లా, బాబురావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృగశిర రోజు చేపలు ఎందుకు తినాలి..?

మృగశిర కార్తె వచ్చేసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోతుంది. అయితే ఈ మృగశిర రోజున తప్పకుండా చేపలు తినాలని చెబుతుంటారు. ఇక ఆరోజు ఫిష్కు ఉండే గిరాకి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే అసలు మృగశిర రోజు మాత్రమే చేపలకు ఎందుకు గిరాకి పెరుగుతోంది? ఆరోజు ఫిష్ ఎందుకు తినాలి. దీని వలన ఏమైనా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయా అనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.



రోహిణి కార్తె సమయంలో ఎండలు దంచి కొడుతాయి. అయితే అంతకు ముందు కూడా ఎండ వేడితో ప్రజలు అల్లాడి పోతుంటారు. కానీ మృగశిర కార్తెతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోతుంది. దీంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. దీని వలన అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. జ్వరం, దగ్గు లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే వాటన్నింటి నుంచి ఉపశమనం కోసం, అలాగే మన శరీరంలో వేడి ఉండేందుకు, రోగనిరోధక శక్తి పెరగడానికి చేపలు తింటారు. కొన్ని ప్రాంతాల్లో బెల్లంలో ఇగువ కలుపుకొని తింటారు.

### చేపలు తినడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు:

మృగశిర కార్తె రోజు చేపలు తినడం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుండె జబ్బులు, ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. గర్భిణీలు, చేపలను తినడం వలన పాలు సరిపడి నంతగా పడుతాయి. అంతే కాకుండా వ్యాధి నిరోధక శక్తి పెరిగి, నాడీ వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

# ఎమ్మెల్యే గారు మా సమస్య పరిష్కరించండి

**- లారీ టిప్పర్స్ డ్రైవర్స్ నూతన అగ్రిమెంట్ చేయించండి**

**- 14,16 టైరు టిప్పర్ల డ్రైవర్ల ఆవేదన**



మణుగూరు, జూన్ 7, ప్రజాజ్యోతి

మణుగూరు ఏరియా సింగరేణి నుండి భద్రాద్రి పవర్ ప్లాంట్ కు టెండర్ ద్వారా బొగ్గు రవాణా చేస్తున్న 14, 16 టైర్ల టిప్పర్స్ డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ డ్రైవర్లు మూడు రోజులుగా చేస్తున్న సమ్మెకు సిఐటియు యూనియన్ మద్దతుగా నిలిచింది. అయితే సమ్మె చేస్తున్నప్పటికీ ఓనర్లు పట్టించుకోవడంలేదని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవ చూపాలని శుక్రవారం సమ్మెలో పాల్గొన్న డ్రైవర్లు వేడుకుంటున్నారు. గతంలో చేసిన అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్ కు రోజుకు 1000 రూపాయల జీతం ట్రిప్పుకు 120 రూపాయల బేటా ఇచ్చేవారని, నూతన అగ్రిమెంట్ ప్రకారం 1200 జీతం 150 రూపాయల బేటా ఇవ్వాల్సిందిగా నిర్ణయించడం జరిగిందని, కానీ నూతన అగ్రిమెంట్ చేయకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడపలేక ఇబ్బందులకు గురవుతున్నామని, తమ డ్యూటీ విషయాల్లో ఎన్ని సమస్యలు ఉన్నా బయటకి చెప్పుకోలేక నిత్యం ప్రమాదాల నడుమ డ్యూటీ చేయాల్సి వస్తుందని డ్రైవర్లు వాపోతున్నారు. లారీ డ్రైవర్ అసోసియేషన్, ఓనర్స్ అసోసియేషన్ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం తక్షణమే నూతన అగ్రిమెంట్ చేయాలని వేడుకుంటున్నారు. ఈ సమ్మెలో లారీడైవర్స్ ప్రెసిడెంట్ సపాక శ్యామ్, కార్యదర్శి సతీష్, ఉపాధ్యక్షులు నెట్టెం కోటేశ్వరరావు, మరో ఉపాధ్యక్షులు యామంకి సాంబయ్య, సహాయ కార్యదర్శి వెంకన్న, ట్రెజరర్ మచ్చ ముత్తయ్య, జి సతీష్, కొమ్ము రవి, శ్రీను, వేణు, వెంకటేశ్వర్లు, కాలవ ప్రసాద్, రాంబాబు, జగదీష్, నాగరాజు, సిద్దిపాక కళ్యాణ్, మరి కొంతమంది డ్రైవర్లు పాల్గొన్నారు.



# విత్తనాలు, పురుగు మందుల దుకాణాలలో విస్తృత తనిఖీలు

**- జీలుగులకు ప్రత్యామ్నాయం పప్పుధాన్యాలు వాడాలి**

**- మణుగూరు ఎడిఏ బి తాతారావు**



ములకలపల్లి, జూన్ 7,ప్రజాజ్యోతి:

మండలంలోని చాపరాలపల్లి, ములకలపల్లి, జగన్నాధపురం, పూసుగూడెం గ్రామాలలోని విత్తనాలు , పురుగుమందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ మణుగూరు ఏడిఏ బి తాతా రావు, స్థానిక ఏఓ కరుణామయి కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ విత్తనాల దుకాణాల యజమానులు స్టాక్ బోర్డ్ ఏర్పటు చేయాలని, కొనుగోలు, అమ్మకానికి సంబంధించిన వివరాలను ఎప్పటి కప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు . కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు పంట మార్పిడి విధా నాన్ని అవలంబిస్తే అధికదిగుబడులు వస్తాయని, జీలుగులకు బదులుగా, పెసర, వంటి పప్పు ధాన్యాలను వాడితే రైతుల ఆర్థికాభివృద్ధి తోపాటు, భూసారాన్ని సైతం పెంచుకోవచ్చు అని తెలిపారు. ప్రతి రైతు ఓ ఆవు ను పెంచుకుంటే, సేంద్రీయ వ్యవసాయానికి సులభతరంగా ఉంటుందని, సేంద్రియ ఎరువులు వాడడం వలన ఖర్చు తగ్గడం తోపాటు, భూమి సైతం సారవంతంగా మారుతున్నారు.

# ఒకే రోజు 23 మంది ఆదివాసీ మహిళలకు స్కానింగ్ పరీక్షలు

భద్రాచలం,జూన్ 7, ప్రజా జ్యోతి

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేనప్పటికీ వైద్యుల కొరత ప్రభావంతో ఆదివాసి మహిళలకు ప్రాణాపాయం కలగకూడదన్న ఉద్దేశంతో భద్రాచలం ఐటీడీయో ప్రాజెక్ట్ అధికారి ఆదేశానుసారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్నెంట్ ముదిగొండ రామకృష్ణ ప్రత్యేక చోరువతో ఒకేరోజు 23 మంది మారుమూల ఆదివాసి గర్భిణీ మహిళలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. వివరాల్లోకెళ్తే గత సంవత్సర కాలం నుండి భద్రాచలం ఆసుపత్రి స్కానింగ్ విభాగానికి ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో మార్మూల ఆదివాసి గ్రామాలనుంచి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భద్రాచలం ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ప్రత్యేక చొరవ తో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ముదిగొండ రామకృష్ణ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన స్కానింగ్ వైద్య అధికారిని ప్రతి వారంలో రెండు సార్లు భద్రాచలం ప్రభుత్వాసుపత్రి లోని స్కానింగ్ నిర్వహించే విధంగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏజెన్సీ ప్రాంతంలోని 23 మంది గుత్తి కోయ గర్భిణీ మహిళలకు ఒకేరోజు స్కానింగ్ పరీక్షలు నిర్వహించి కావలసిన వైద్య సూచనలను అందించారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోయినప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో ఇతర ప్రాంతాల నుండి వైద్య బృందాన్ని పిలిపించి మరి వైద్య సేవలు అందించడంతో



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పై ఈ ప్రాంత ప్రజలకు నమ్మకం నిలబడుతుంది. తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో మూడు రాష్ట్రాలకు సరిత ప్రాంతంగా ఉన్నటువంటి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పూర్తిస్థాయిలో వైద్యుల్ని నియమించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# నాటు సారా దుకాణాలు అరికట్టాలి

**- నర్సాపురం గ్రామ మహిళలు**



దుమ్ముగూడెం, జూన్ 7, ప్రజా జ్యోతి

దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామ మహిళలు గ్రామంలో ఉన్నటువంటి నాటు నాటు సారా దుకాణాల పై మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో దుమ్ముగూడెం ఎస్సై కి ఫిర్యాదు చేయడం జరిగింది. ఎక్సైజ్ శాఖ కి పలుమార్లు ఫిర్యాదు చేసిన ఆ శాఖకు ఎటువంటి చలనం లేదని గ్రామంలో ఉన్నటువంటి గుడుంబా దుకాణాలు వల్ల ప్రతి కుటుంబంలో ఘర్షణలు జరుగుతున్నాయని, ఈ దుకాణాలను అరికట్టే దిశగా పోలీస్ మరియు ఎక్సేంజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరిన మహిళలు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరమాచినేని వినీల్, శిరపు అప్పలరెడ్డి, గ్రామ మహిళలు కనుక రమాదేవి, పుల్లమ్మ భారతి, లక్ష్మి, వెంకట నరసమ్మ, సంపల్లీ వెంకటమ్మ, వల్లపాక భువమ్మ, కనుక రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘర్షణలో ఇరువర్గాలకు గాయాలు

**- ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు**

ములకలపల్లి, జూన్ 07, ప్రజాజ్యోతి:

ఘర్షణలో ఇరువర్గాలకు తీవ్ర గాయాలు కాగా ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసుకున్న సంఘటన మండల పరిధిలోని తిమ్మంపేట లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు, స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మంపేట గ్రామానికి చెందిన రాయల రాములు స్థానిక వి ఆర్ ఏ ( మిషన్ భగీరథ లో హెల్పర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన జలగం కృష్ణ ఇంటి ఎదురుగా వెళ్లి అసభ్యపదజలంతో దుర్భాషలాడుతుండగా, ఆగ్రహానికి గురైన కృష్ణ , ఆయన కుమారుడు సుభాష్ లు రాములుపై దాడి చేశారు. తన తండ్రి పై దాడిచేసిన వారిలో ఒక్కరైనా జలగం సుభాష్ శుక్రవారం అటుగా వెళుతుండగా రాములు కుమారులు, రాయల రమేష్, శ్రీను, సురేష్, అతనిపై దాడికి పాల్పడతారు. ఈ దాడిలో సుభాష్ తలపగిలి తీవ్ర రక్తస్రావం అవుతుంది. ఈ క్రమంలో ఇరువర్గాల ములకలపల్లి లోని పోలీస్ స్టేషన్ కు చేరుకొని, ఒక్కరిపై ఒక్కరూ పిర్యాదు చేసుకోవడంతో ఇరువర్గాలకు చెందిన ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రాజమౌళి తెలిపారు. ఇదిలావుంటే రాయల రాములుకి గ్రామంలో కొంత భూమి ఉండేదని ఆ భూమి లో కొందరు నివాసాలు ఏర్పాటు చేసుకోని ఉంటున్నారని, ఈ క్రమంలో రాములు అప్పుడప్పుడు తన భూమిలో అక్రమంగా ఉంటున్నారని దూషిస్తూ ఉంటాడని ఇదే ఘర్షణకు దారి తీసినట్లు సమాచారం.

# ఏఐటియుసిలో చేరిన శ్రీనివాస్ రెడ్డి

ఇల్లందు, జూన్ 7, ప్రజాజ్యోతి:

ఇల్లందు పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు, టిబిజికెఎస్ నేత నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఏఐటియుసి సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె. సారయ్య ఆధ్వర్యంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు మిర్యాల రంగయ్య సమక్షంలో ఏఐటియుసి, సిపిఐలో చేరగా పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఏఐటియుసి, సిపిఐ బలోపేతం కోసం కోసం కృషి చేయాలని కోరారు. సింగరేణి, కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి, సిపిఐ నిరంతరం పోరాటాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి యండి నజీర్ అహ్మద్, సిపిఐ, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డులు ఊరు బయట ఏర్పాటు చేయాలి





**పాల్వంచ, జూన్ 7, ప్రజాజ్యోతి:**

మున్సిపాలిటీ ద్వారా సేకరించిన చెత్తను స్వచ్ఛ ఆటోల ద్వారా ఊరి బయట వేయడానికి డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ చెత్తను రవాణా చేసే స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు శుక్రవారం పాత పాల్వంచ ఊరి మధ్య నుండి తీసుకువెళ్తుండగా గ్రామస్తులు అడ్డుకొని, స్వచ్ఛ ఆటోలను నిలిపివేశారు. మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామి తో పాటు మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పాత పాల్వంచ రజక వీధికి సంబంధించిన గ్రామస్తులు కొత్వాల దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన హుటాహుటిన అక్కడకు చేరుకొని, మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఊరి మధ్య నుండి, పూజా సముదాయాలు, నివసించే ప్రాంతాల నుండి చెత్త వాహనాలను తరలించడం వలన దుర్వాసనకు ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. పాత పాల్వంచ ఊరి మధ్య నుండి వెళ్లే వాహనాలను వెంటనే నిలిపివేయాలన్నారు. ప్రజ లను ఇబ్బంది పెట్టె ఏ కార్యక్రమాన్నైనా సహించేదిలేదని కొత్వాల హెచ్చరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రెండు నెలల వ్యవధి కోరి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు స్వచ్ఛ ఆటోలను తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామి, డీఈ మురళి, సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, గ్రామస్థులు యాకుబ్, రెహ్మాన్, కరీం, రజక సంఘం నాయకులు, దారా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పాడతాయి





**ఇల్లందు, జూన్ 7, ప్రజాజ్యోతి:**

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో తోడ్పడతాయని ఇల్లందు ఏరియా జియం జాన్ ఆనంద్ తెలిపారు. శుక్రవారం స్థానిక 24 ఏరియాలోని రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో జరిగిన సింగరేణి, ఇల్లందు ప్రెస్ క్లబ్స్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ను జియం ప్రారంభించారు. ఈ సందర్భంగా జియం మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. క్రీడలలో గెలిచినవారు గర్వపడకుండా, ఓడిన వారు నిరుత్సాహం దకుండా ఉండాలని సూచించారు. క్రీడలలో ఓడినవారు ఓటమికి గల కారణాలను తెలుసుకొని మరల పునరావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఓటమి గెలుపుకు నాంది అని, ఓటమి చెందినప్పుడే గెలుపు కోసం నిరం తరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జరిగిన క్రికెట్ మ్యాచ్ లో టాస్ గెలిచి ప్రెస్ క్లబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. సింగరేణి జట్టు 12 ఓవర్లలో 111 రన్స్ సాధించింది. 112 లక్ష్య సాధనలో ప్రెస్ క్లబ్ జట్టు 82 పరు గులు చేయడం జరిగింది. విజేతగా నిలిచిన సింగరేణి జట్టును ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్ కప్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జియం మల్లారపు మల్లయ్య, కెఓసి పిఓ శ్రీనివాస్, అధికారుల సంఘం నేత బోడ నాగేశ్వరరావు, గుర్తింపు సంఘ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె. సారయ్య, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, డీజీఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, పర్యావరణ అధికారి ధనుంజయ రెడ్డి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, ప్రెస్ క్లబ్ జట్టు కెప్టెన్ ఎస్. ఎల్. శ్రీకాంత్, ప్రెస్ క్లబ్ సభ్యులు, సింగరేణి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లే విధంగా చూడాలి

**- ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి**

**- బడిబాట కార్యక్రమం పై ప్రధానోపాధ్యాయులు, ఐసిడిఎస్, ఐకెపి సభ్యులకు అవగాహన కార్యక్రమం**



**పాల్వంచ, జూన్ 7, ప్రజాజ్యోతి:**

ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు తెలియచేసి విద్యార్థులను స్కూల్ లో చేర్పించాలని ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి సూచించారు. శుక్రవారం పాల్వంచ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో బడిబాట కార్యక్రమం పై ప్రధానోపాధ్యాయులు, ఐసిడిఎస్, ఐకెపి సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రతి స్కూల్లో మహిళా సంఘాల సభ్యులతో కమిటీలు వేసి ప్రతి విద్యార్థి స్కూలుకు వెళ్లే విధంగా చూడాలని, గ్రామం యొక్క ఎడ్యుకేషన్ లిస్ట్ తయారు చేసి ప్రతి పిల్లవాడు ఎక్కడెక్కడ చదువుతున్నాడు అనేది ఉపాధ్యాయుల దగ్గర ఉండాలని సూచించారు. స్కూలు ప్రారంభించే రోజుకు ముందే పిల్లలకు బట్టలు, పుస్తకాలు అందించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ..బడిబాట కార్యక్రమంలో భాగంగా 6వ తేదీ నుండి 19వ తేదీ వరకు ప్రతి ఉపాధ్యాయుడు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో అవగాహన కల్పించి 100శాతం పిల్లలు బడిలో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం డ్వాక్రా మహిళలు కుట్టిన స్కూల్ డ్రెస్ లను ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వివేక్, సిడిపిఓ రేవతి, ఎంపీవో బొగ్గ నారాయణ, నోడల్ అధికారి బి ప్రకాష్ రావు, ఏపిఎం రాంబాబు, ఏపీఓ రంగా, ప్రధానోపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.




# బడిబాటను విజయవంతం చేయాలి



**టేకులపల్లి, జూన్ 7, ప్రజాజ్యోతి:**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా స్థానిక అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి విద్యా చందన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని, తమ పిల్లలందరినీ ప్రైవేటు పాఠశాలకు పంపకుండా, ప్రభుత్వ పాఠశాలలో చదివించేలా విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత చదువులు చదివి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించిన వ్యక్తులే ఉపాధ్యాయులుగా ఉన్నారన్న విషయాన్ని విద్యార్థులా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లల్ని చదివించడం వల్ల ఆర్థిక భారం తప్పుతుం దని విద్యార్థులు తల్లిదండ్రులకు సూచించారు. ఆయా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాంశాల పథకంలో భాగంగా చేపట్టిన మన వంతు పనులు పాఠశాల ప్రారంభానికి పూర్తయ్యేలా చూడాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులు కావాల్సిన అన్ని సౌకర్యాలు, మౌలిక వస్తువులను ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు 2 జతల ఏకరూప స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఏకరూప దుస్తులను ఈనెల 8వ తేదీ వరకు పాఠశాలకు అందజేయాలని స్థానిక ఎంపీఓ రవికుమార్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా నోడల్ అధికారి సైదులు, టేకు లపల్లి తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీవో అధికారి జి. రవీందర్, మండల సమాఖ్య ఎంపీఓ రవికుమార్, అధికారి జగన్, సీసీలు, వివోఏలు, మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఎత్తివేశారు సమస్యలు పరిష్కరించండి



**మణుగూరు రూరల్, జూన్ 7, ప్రజాజ్యోతి:**

కేంద్ర ఎన్నికల కమిషన్ విధించిన ఎన్నికల కోడ్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి) ఎత్తివేసిన నేపథ్యంలో సాధారణ పరిపాలన కొనసాగింపునకు మార్గం సుగమం అయింది కనుక ఏరియా సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతూ సింగరేణి ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం ఏరియా ఎస్ టు జి ఎం డి శ్యాంసుందర్ ని కలిసి సమస్యలు విన్నవించారు. ముందుగా మర్యా దపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన మాట్లాడారు, ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి రైట్స్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్ ఓ ఆర్) యాక్టింగ్ ఫ్యానల్. ప్రమోషన్ పాలసీ పైన, ఇతర సమస్యల పైన చర్చించడం జరిగిందని , ఎస్ఓటు జిఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వర రావు. సెంట్రల్ కమిటీ మెంబర్ జిమ్మిడి మల్లేష్. ఎం రవి. మధుసూదన్(చిన్ని) సుమన్. మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ శనిగరపు కుమారస్వామి. డివైఎఫ్ఎం పసుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.